హర హర.. మహాదేవ

'హర హర మహాదేవ.. శంభో శంకర' అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినదించారు. శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. కార్తీక మాస రెండో సోమవారం, పౌర్ణమి కలిసి రావడంతో.. భక్తజనం భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శివునికి అభిషేకాలు చేశారు. తమను కాపాడాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

– నెట్‌వర్క్, సాక్షి



బద్వేలు అర్బన్ : కాశీ విశ్వేశ్వరస్వామి శివాలయంలో స్ఫటిక శివలింగం



ప్రొద్దుటూరు కల్చరల్ : కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా కోటి దీపోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామిని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఆధ్వర్యంలో గీతాశ్రమ సహకారంతో నిర్వహించిన కోటి దీపోత్సవం కనుల పండువగా జరిగింది. పరమశివుని విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగింపుగా దేవదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ, భక్తులు మైదానానికి తీసుకువచ్చారు. అక్కడ వేద పండితుల మంత్రోచ్చారణలతో శివలింగానికి అభిషేకాలు చేశారు. స్వామిని శివదర్శనానంద సరస్వతి మాతాజీ కార్తీక మాస ప్రాముఖ్యతను, పరమశివుని గొప్పతనాన్ని, మహిమలను భక్తులకు వివరించారు. శివలింగానికి బిల్వార్చన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సప్తహారతులు, జ్వాలా తోరణం, అనంతరం కోటిదీపాలను వెలిగించారు. భక్తులలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు గీతాశ్రమం సహకారంతో కోటి దీపోత్సవాన్ని నిర్వహించామని ఏసీ శంకర్ బాలాజీ తెలిపారు. భక్తులు వెలిగించిన కోటి దీపకాంతులతో ఆ ఆప్రాంతం నూతన శోభను సంతరించుకోవడంతోపాటు శివనామస్మరణలతో మారుమోగింది. కార్యక్రమంలో రవీంద్ర హైస్కూల్ వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకరరెడ్డి, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. శివుని భక్తిగీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



హారతి ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఖాజీపేట : నాగనాథేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చాపాడు: అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి, భద్రకాళిమాత పల్లకీ సేవ



బి.కోడూరు : మేకవారిపల్లె అఖిలానందకోటి బ్రహ్మేనంద ఆశ్రమంలో 108 శివలింగాలు



ప్రొద్దుటూరు కల్చరల్ : దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాజుపాళెం : సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు



ఖాజీపేట : నాగనాథేశ్వరస్వామి ఆలయం వద్ద భారీగా భక్తజనం

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కలసపాడు (కాశినాయన) : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కాశినాయన ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాశినాయన మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న వివేకానంద సేవాశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎస్‌ఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత గ్రామాల్లో నాటేందుకు ముందుకు రావాలని తెలిపారు. అనంతరం ఆయన వివేకానంద సేవాశ్రమాన్ని సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న అవ్వాతాతల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం ప్రాంగణమంతా మొక్కలతో ప్రశాంతమైన వాతావరణంలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు పాపిజెన్నిరామకృష్ణారెడ్డి, రామతులసిలను అభినందించారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర విద్యాకమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గద్దం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు జీతంతోపాటు పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఇవి ఎక్కడా అమలు కాలేదని ఆయన పేర్కొన్నారు. కమిషనర్ ఉత్తర్వులను అమలు చేయని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీఓగా సాయినాయక్



గోపవరం : మండల అభివృద్ధి అధికారిగా ఎం.సాయినాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరపునాయునిపల్లె ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి అయ్యారు. ఇప్పటి వరకు ఈఓపీఆర్‌డీ హసీనా ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన సాయినాయక్ గ్రూప్–1 ద్వారా ఎంపీడీఓగా రిక్రూట్‌మెంట్ అయ్యారు. ఈ మేరకు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

డెహ్రాడూన్‌కు వెళ్లిన తైక్వాండో క్రీడాకారులు

పోరుమామిళ్ల : ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు పోరుమామిళ్ల క్రీడాకారులు సోమవారం బయలు దేరారు. డిసెంబర్ 1 నుండి 3 వరకు పోటీలు నిర్వహిస్తారని మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. సబ్‌జూనియర్స్ విభాగంలో నాదేష్, పునీత్, లక్కీ, కాడెట్ విభాగంలో అబూబకర్, నందు, నాగదీపిక జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి కోచ్‌లుగా సుభాష్, ఇస్మాయిల్ పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభినందనలు తెలిపారు.


ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలి



వెంకటేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న తల్లం సుధాకర్

మైదుకూరు : ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆర్యవైశ్యసభ అనుబంధ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ తిరువేది వేణుగోపాల్ అన్నారు. మైదుకూరులో సోమవారం వాసవీ క్లబ్ వి.206 గవర్నర్ తల్లం సుధాకర్ వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏడాది పదవీ కాలం ముగియడంతో ఉమ్మడి కడప, అనంతపురం జిల్లాల వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్‌ను కార్యక్రమంలో వాసవి క్లబ్‌ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వచ్చే ఏడాది వి.206 వాసవి క్లబ్ గవర్నర్‌గా నియమితులైన పుట్టపర్తికి చెందిన సీఏహెచ్ వెంకటేశ్వరరావుతో ప్రస్తుత గవర్నర్ తల్లం సుధాకర్, తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సందేశ్, తులసి స్వప్న, చంద్రశేఖర్, సూర్యనారాయణ, శేషపాణి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



పవన్ భార్గవ్‌రెడ్డి వర్ధంతిలో రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కడప అక్కాయపల్లెకు చెందిన వడ్డెమాని పవన్ భార్గవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు వి.లక్ష్మీదేవి, రామలింగారెడ్డి చింతకొమ్మదిన్నెలోని గంగమ్మ తోపులోని ఆంజనేయ స్వామి ఆలయం, వేంపల్లె రాజీవ్‌కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం, కడప అజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమం, ఇందిరా నగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమాలలో అనాథ వృద్ధులకు వస్త్రదానం చేశారు. కుటుంబ సభ్యులు రాజరాజేశ్వరి, వెంకట సుబ్బారెడ్డి, వెంకట మోహిన్వ్‌రెడ్డి, అరుణ కుమారి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచనల మేరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు ఎంపీడీఓ కుళ్లాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రైతులకు సంబంధించిన సమస్యలపై కలెక్టర్ విజయరామరాజును కలిసి చర్చించారన్నారు. ఈ మేరకు పీడీ యదుభూషణ్‌రెడ్డి ఎమ్మెల్యేతో చర్చించారని తెలిపారు. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలోని కేసీ కెనాల్ ఆయకట్టు, మైలవరం డ్యాం ఆయకట్టు కాలువల్లో పూడికతీత పనులు చేస్తే భవిష్యత్తులో చివరి ఆయకట్టు వరకు నీరు అందించి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పంపడం జరిగిందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైస్పేస్ తైక్వాండో క్లబ్ విద్యార్థి షణ్ముఖ వీర జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి కేడెట్ తైక్వాండో పోటీలలో అండర్–53 బాలువ విభాగంలో బంగారు పతకం సాధించాడు. డిసెంబరు 1 నుంచి డెహ్రాడూన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నాయబ్ రసూల్, సహాయ కార్యదర్శి మహబూబ్ బాష, కోచ్ సలీమ్ అభినందించారు.

రక్తదానంలో యువత ముందుండాలి

బద్వేలు అర్బన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇలాంటి గొప్పకార్యంలో యువత ముందుండాలని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ పేర్కొన్నారు. ఎన్‌సీసీడే సందర్భంగా సోమవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు రక్తదానం చేయడం ఎంతో మంచిదని సూచించారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ట్రెనింగ్ డాక్టర్స్ మొబైల్ వాహనం సిబ్బంది, ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు, రక్తనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు చేసింది సున్నా

మైదుకూరు : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాష్ట్రానికి అనేక వనరులతో ఆదాయం ఉన్నా చంద్రబాబు ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లెలో సోమవారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉండగా రాష్ట్ర ఆదాయం బాగా ఉన్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలల్లోనే రాష్ట్రాన్ని కరోనా మహమ్మారి కబళించి ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. శెట్టివారిపల్లె సచివాలయ పరిధిలో అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, పింఛన్లు, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతోపాటు, అభివృద్ధి పనులకు మొత్తం రూ.27.87 కోట్లు ఖర్చు చేసినట్టు ఎమ్మెల్యే వివరించారు. ఆ మేరకు వివిధ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని తెలిపే బోర్డును ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ మేనేజర్ పరమేశ్వరరెడ్డి, అధికారి సుబ్బరాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలోశెట్టివారిపల్లెలో నెలకొల్పిన దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి ఆవిష్కరించారు. శెట్టివారిపల్లె సచివాలయ పరిధిలో ఒకటో వార్డులో కేశలింగాయపల్లెలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను ఎగురవేశారు.



శెట్టివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

శెట్టివారిపల్లెలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులు రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఉచిత ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా గ్రామంలోని మసీదుకు ఎంపీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, వార్డు నాయకులు కె.అమరనాథరెడ్డి, కె.చిన్నమధురెడ్డి, కె.రవీంద్రారెడ్డి, కౌన్సిలర్ వెంకటేష్, ఒకటో వార్డు ఇన్‌చార్జి ఏసీకే రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల అధ్యక్షుడు గల్లా నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14, 23 వార్డుల్లో గల రామాంజనేయనగర్, వెంగమాంబనగర్, సుమిత్రానగర్‌లలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా బావించి సాగిస్తున్న పాలనతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవిశ్రీరాములు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గౌస్‌బాష (బాబ్జీ), ఆయా వార్డుల కౌన్సిలర్లు కరీముల్లా, మౌలాలి, ఓబుల్‌రెడ్డి, దుద్దుకూరుసత్యం, చెన్నకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, గురివిరెడ్డి, రెడ్డెయ్య, మల్లేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.



సుమిత్రానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

15 రోజుల్లోనే రోడ్డు మంజూరు

ప్రొద్దుటూరు : కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి అడిగిన మేరకు కేవలం 15 రోజుల్లోనే సిమెంటు రోడ్డు, డ్రైనేజి కాలువలను మంజూరు చేయించానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 17వ వార్డు పరిధిలోని బుకారియా మసీదు వీధిలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజి కాలువలకు సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు ప్రజలు నేరుగా వచ్చి సమస్యలను తెలిపితే వెంటనే స్పందించి రోడ్లు, కాలువలు మంజూరు చేయిస్తానని అన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.110 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల్లో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. రూ.150 కోట్లతో అమృత్ తాగునీటి పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికీ నీరు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మేలు జరిగిందని భావిస్తేనే వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని అన్నారు. గత పాలకులకు, తనకు వ్యత్యాసాన్ని గమనించాలని సూచించారు. ఓ వైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి, మాజీ కౌన్సిలర్ చింతకుంట జయలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కందుకూరి రాజేష్, డీఈ రమణ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

అథ్లెటిక్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు : రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో ఇటీవల జరిగిన యోగివేమన యూనివర్సిటీ వార్షిక కాలేజియేట్ అథ్లెటిక్స్ మీట్‌లో వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు తెలిపారు. జావలిన్ త్రోలో ఆర్.సురేంద్రనాయక్ ద్వితీయ బహుమతి, బ్యాడ్మింటన్ (ఉమెన్స్ డబుల్స్)లో ఆర్.హర్షిత, ఆర్.జయశ్రీ ద్వితీయ బహుమతి, మెన్స్ డబుల్స్‌లో ఎ.గోపాలకృష్ణ, కె.వర్షిత్ తృతీయ బహుమతి సాధించారని ఆయన వివరించారు. లాంగ్ జంప్, రన్నింగ్ రేస్(400 మీటర్స్) ఈవెంట్‌లో ఎస్.ఇబ్రహీం, రన్నింగ్ రేస్ (100, 800 మీటర్లు)లో బి.పల్లవి, షాట్‌పుట్‌లో ఎ.చెంచుబాబు ప్రతిభ కనబరిచారన్నారు. ఆర్.హర్షిత రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ ఎస్.రగునాథ్‌రెడ్డి, సపోర్టింగ్ సిబ్బంది ఎ.రాజశేఖర్ అభినందించారు. విద్యార్థులకు అవసరైన క్రీడా పరికరాలు, సౌకర్యాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. భవిష్యత్తులో క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సి.నాగరాజు

నేటి నుంచి టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

పోరుమామిళ్ల : తిరుమల–తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలో మంగళవారం నుంచి శనివారం వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రచార పరిషత్ సభ్యులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం రామాయణ, భారత, భగవద్గీతలపై ఉపన్యాసములు, భజనలు, పూజలు ఉంటాయన్నారు.

నేడు మల్లేలమ్మ జాతర

ప్రొద్దుటూరు : స్థానిక మేదరవీధిలో వెలసిన మల్లేలమ్మ ఆలయంలో జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మేదర మహేంద్ర సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మవారికి ఉదయం విశేష పూజా కార్యకార్యక్రమాలను నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం కిశోర్ కేటరింగ్ వారు ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ నూకా నాగేంద్రరెడ్డి, పాత మార్కెట్ ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కేవీఎస్ సత్యం, మేడా కిషోర్, ఘంటసాల శివకుమార్, మిట్టా వేణు, నల్లం రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.